అనుమానం

శ్రీమతి జి. లక్ష్మీరాజ్యం

[జరిగినగాథ :— సుందరం వట్టి అనుమానం మనిషి. సుందరం భార్య వనజ గడసరి. భయభక్తులుగల మనిషి. కారణం లేకుండా భార్యపై అనుమానపడి ప్రక్కింటికి వెళ్ళద్దంటాడు సుందరం. కాని ఆఫీసులో కూర్చున్నప్పుడు, అనవసరంగా భార్యపై అనుమాన పడుతున్నానని తనలో తనే తర్కించుకుంటాడు. ఒక రోజు ప్రక్కింట్లో పేరంటానికి పిలుస్తే వెళ్ళింది వనజ. అనుమానంకొద్దీ పనికట్టుకొని తాళం మిషపై ప్రక్కింటికొస్తాడు. అక్కడ ఆ యింటివారమ్మాయి గౌరితో మంతనాలాడ్డం వనజ గ్రహిస్తుంది. ఇంటికి రాగానే సుందరం కోపంగా వనజను దండిస్తే అదును దొరికిందని తనూ భర్తను ఎదిరిస్తుంది. తనమాట కెదురు చెప్పిందనే కోపంకొద్దీ యింట్లోంచి పొమ్మని బైటికి గెంటేస్తాడు వనజని.

అర్ధరాత్రి ఎక్కడికి వెళుతుంది? పైగా గర్భిణీస్త్రీ! ఆత్మహత్య చేసుకోకూడదని, తిన్నగా పుట్టింటికి చేరుకుంటుంది. అనుకోని కూతురి ఆగమనానికి తల్లిదండ్రులు ఆశ్చర్యపోతారు. కాని వున్నసంగతి వనజ చెప్పక దాస్తుంది. కొన్నిరోజులయాక సంగతంతా చెపుతుంది. తండ్రి అల్లునిపై మండిపడి, కూతురే కొడుకని తలుస్తానంటాడు. కాని లోకం వనజ రాకనుగురించి గుసగుసలాడుతున్నదని తల్లి మనోవ్యధ చెందుతుంది. తనవల్ల తల్లిదండ్రులు అవమానపడుతున్నారని, ప్రసవమైన తరువాత ఏలాగైనా అచ్చటినుంచి పోవాలని నిశ్చయించుకుంటుంది. తన భావి జీవితం గురించి ఆలోచిస్తూ "యింత విశాల ప్రపంచంలో బతకడానికే చోటులేదా? ఇన్ని మహానగరాలు, పల్లెలు ఉన్నాయి. చివరకు భిక్షాటన అయినా చేసుకొని బతకవచ్చ"ని నిర్ణయించుకుంటుంది. ఇక చదవండి]

వనజ సుఖప్రసూతై ఇరవై రోజులు దాటింది. మగబిడ్డ. దబ్బపండువంటి శరీరం, బొద్దుగా వున్న వొళ్ళు చాలా ముద్దొస్తున్నాడు. వనజ తనకార్యక్రమానికి నాందిగ తన చేతి గాజులమ్మించి డబ్బు జాగ్రత్త చేసుకుంది.

అనాడే వనజ ప్రయాణం కావలసి'యుంది. తనకి తప్ప మరెవ్వరికీ తెలియదు. తెలియకూడదు. చాలా శాంతంగా గానేవుంది వనజ. కాని ధైర్యాన్ని చిక్కబట్టుకొంది. కుటుంబగౌరవాన్ని కాపాడి, తన మానాన్ని, ప్రాణంతో సమమైన పసిపాపని కాపాడుకోవాలి. భవిష్యత్తులో ఇదే వనజ ఆదర్శం. కొద్ది బట్టలుమాత్రం ఒకసంచిలో జాగ్రత్త చేసుకున్నది.

"నాన్నగారికి — కుమార్తెగా, భార్యగా, తల్లిగా సాధర్మ్యం, నాకు బాగా తెలుసుననుకుంటాను. విధివ్రాత ప్రకారం ఆధర్మాన్ని నిర్వహించేందుకే మీదగ్గర శెలవు తీసుకుంటున్నా. ఎక్కడో జీవించే వుంటాను. అన్యథా భావించకండి. సమాజం అగౌరవం చూపిస్తున్నా మీరు ఆదరించినందుకు వేవేలవందనాలు.

మీ కుమార్తె వనజ"

అని చీటీ వ్రాసి టేబిలుమీదపెట్టి ఎవ్వరికీ తెలియకుండా వెళ్ళిపోయింది కొడుకును తీసుకొని —

మదరాసు మెయిలు మహావేగంగా పోతోంది. స్త్రీల పెట్టెలో వనజ కూర్చొని తన చిన్నారిని చూస్తూ భావిజీవిత విధిగూర్చి ఎన్నో కలలు కంటోంది.

ఏలూరు స్టేషను వచ్చింది. ఎవ్వరో ఒకామె చాలా సామానులతో ఆపెట్టెలో ఎక్కింది. వనజ పాపకు పరచిన ప్రక్కను తీసివేసి ఆమెకూర్చొనేందుకు జాగాయిచ్చింది. ఆమె వనజవైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసింది. వనజను చూసిన వెంటనే ఆమెకు ఎందుకో గొప్ప అభిమానం ఏర్పడింది. వనజ చేతిలోని బిడ్డే కారణం కావచ్చు. పైగా వనజ ముఖంలో నృత్యం చేస్తున్న భావసంచయాన్ని ఆమె

గ్రహించగలిగి వుండాలి. అందాలు చిందే ఆబిడ్డని చూస్తుంటే బిడ్డలులేని ఆమె 'ఆబిడ్డ - నా పాప అయితే ఈపాటికి ఎన్నిసార్లు పాప పాలబుగ్గల్లోవున్న అమృతాన్ని ఆస్వాదించేదాన్నో' అనుకుంటూ వనజను పలకరించకుండా వుండలేకపోయింది. ఆమె సంస్కారముగల స్త్రీ. విద్యావంతురాలు. ఆదరణ ఆమెకు బాల్యంనుంచీ వున్నదే.

"ఏవూరు వెళ్తున్నారు" అంది ఆమె నెమ్మదిగా.

"మదరాసు" అని వనజ జవాబిచ్చింది బరువైన హృదయంతో.

"మేమూ అక్కడికే లెండి ... ఎక్కడినుంచి వస్తున్నారు" అన్నదామె.

"కాకినాడ నుంచి" అని తలపైకెత్తి ఆమెవంక చూసింది తన కథంతా చెప్తున్నట్లు.

"చంటిపాపతో ప్రయాణం చేస్తున్నారు. మగవారు కూడావస్తున్నారా వెంట" అని కుతూహలంతో ప్రశ్నించిందామె. చిరునవ్వు తొణికిసలాడింది వనజ పెదవుల మీద, పాప వంకచూస్తూ "ఆ... వీడే మగవాడు" అన్నది.

ఇద్దరూకలిసి పాప వంక చూసి నవ్వుకున్నారు. కాని వనజ నవ్వు క్షణంలో మాయమై పోయింది. పాపను ఆమె తీసుకొని తనివితీరా ముద్దులాడుతూ ఘల్లోక సౌఖ్యాల్లో మునిగి తేలుతూన్నట్లు భావించి ఆమె తెలియకుండానే "ఈ పాపని నాకు ఇవ్వకూడదు, మీకు పుత్రదాన ఫలం ఉంటుంది- ఈ పాప తమ్ముణ్ణి కనవచ్చు మీరు" అన్నది బిక్షకోరే ఆమెవలె.

"తప్పకుండా తీసుకోండి- అంతకన్న మహోపకారం నాకేంకావాలి. కాని పసి పాపని పెంచే దాదిగా నన్ను మీతో తీసుకు వెళ్ళండి" అన్నది వనజ గంభీరమైన భావం ప్రకటిస్తూ.

"ఆ !- ఎంతమాటన్నారు. నన్ను పరిహాసం చేస్తున్నారు. గొప్ప వంశపు కళలు ఉట్టిపడుతున్నాయి మీ కళ్ళల్లో- దాది 'అంటారా" అన్నది కొంచెం విచారం చూపిస్తూ.

"వంశము గొప్పది కావచ్చు. మనస్సు మహత్తరమైనది కావచ్చు, కాని కాలం కఠోరమైందయితేనో!" అన్నది వనజ.

"చాలా బాగా అడిగారు- ఆ సమస్యనే నేను వ్రాసిన స్క్రిప్టుకి ఆధారంగా తీసుకున్నాను" అన్నది ఆమె.

"సినిమా కథ వ్రాశారా- పేరేమిటి, ఫిలుమ్ తీస్తారన్న మాట!" అని ప్రశ్నించింది వనజ.

"అవును. మావారే ప్రొడ్యూసరు. డైరక్టరూ కూడా కథ నేనే వ్రాశాను... పేరు 'అనుమానం' అని పెడదామనుకుంటున్నాము" అని చెప్పింది ఆమె.

వీరి సంభాషణల్లో ఒకరి పూర్వోత్తరాలు ఒకరు తెలుసుకున్నారు. ఆమె పేరు కళ్యాణి. వనజయొక్క గత చరిత్ర విని కళ్యాణి చాలా బాధపడింది. కాని ముమ్ముందు తన యింట పాప కవ్వుమన్నది వినపిస్తుందనుకొని సంతోషించింది కళ్యాణి. కాకతాళీయంగా ఈగొప్ప సహాయానికి కృతజ్ఞతను తెలియజేసుకుంది వనజ.

వనజలో మాతృత్వం మూర్తీభవిస్తూంది. అంత చిన్న వయస్సులో అంత గంభీర్యం ఉండటం చాలా అరుదు. వనజ మనఃపూర్వకంగా అంగీకరిస్తే ఆమెను తన సినిమాలో నాయకిగా ప్రవేశపెట్టి వెండి తెరమీద మాతృత్వాన్ని అమోఘంగా ప్రకటించగల అవకాశం ఇవ్వాలని కళ్యాణి లోలోపల అనుకుంది. కాని దీనిలో ఆమె స్వార్థం మాత్రం లేదు. ఫిలిం రంగానికి పవిత్రతనాపాదించాలని మాత్రమే ఆమె వాంఛ. సమయం చూసి నొప్పించకుండా ఒప్పించాలనుకుంది కళ్యాణి.

వారు చాలా హాయిగా ప్రయాణం చేశారు. కళ్యాణి భర్త వనజ సంగతి తెలుసుకొని పుత్రుణ్ణి ఇచ్చిన దేవతగా కొనియాడారు. అవును బిడ్డలు లేనివారి బాధ తీరినది. అందరు కళ్యాణిగారి భవనానికి వెళ్ళారు.

*　　　*　　　*

కళ్యాణి ఇంట్లో వనజ చాలా కలివిడిగా వుంటోంది. కళ్యాణితో ఏర్పడిన ఆదర్శమైత్రి వలన కళ్యాణి కోరికను కాదనలేకపోయింది. సినిమాలో నటించాలని, డబ్బుతో తులతూగాలని వనజకు ఏమాత్రం ఇష్టంలేదు. కళ్యాణి చేసిన ఉపకారం గుర్తుంచుకుంది వనజ. అందువలనే నాయకి పాత్ర వహించేందుకు అంగీకరించింది. అదికాక ఆపాత్రలో చాలా ప్రత్యేకత గోచరించింది వనజకు. తన యాదార్థ జీవిత

అనుమానం

గలిగే ఆ శాస్త్రి దగ్గర సంబంధం పెంచుకొంటుంది, కొన్ని ఇబ్బందులు తెలియకపోయినా సులభంగా గ్రహించే శక్తి గలది వనజ.

ఫిలిం దాదాపు పూర్తయిపోయినట్లే. వనజ చాలా గంభీరంగా, అద్భుతంగా నటించింది. వనజయొక్క ప్రత్యేక కారణ బుద్ధిని కళ్యాణి కొనియాడింది. ఆదర్శ నీదంగా వుంది ఫిలిం. పేరు 'అనుమానం' అనే ఖాయం చేశారు. వనజకు కళ్యాణి కొంత డబ్బు ముట్టచెప్పింది వద్దన్నా.

అయితే వనజకు మానసికంగా మహత్తర పరిణామం వచ్చింది. ఆమెకు భావిజీవితానికి ఎట్టి ఆదర్శ, ప్రయోజనం కనిపించలేదు. భర్త ఎడబాటుగా ఇతరచోట ఉండటం లోకం కళంకం ఆపాదించేందుకే. తన వంశానికి బీజంగా కొడుకు కేశవ భాగ్యవంతులకుంచ చేరగలిగాడు. కేశవ ఎక్కడున్నా తనకొడుకే. ఇంకా తాను ఎందుకు జీవించి ఉండాలో అర్థం కాలేదు. కాని తన భర్తకి కొంత అర్థ సహాయం చేసి భర్త పాదాల దగ్గరే ప్రాణం విడిచి శీలవతి నని రుజువుచేసుకోవాలని ఆమె నిశ్చయించుకొంది.

ఇంక వెళ్ళిపోతాను అనే భావాన్ని కళ్యాణితో సూచాయగా చెప్తూనే ఉంది. 'కేశవ నీకొడుకే' యని ఎన్నోసార్లు చెప్పింది వనజ కళ్యాణితో. కళ్యాణికి కేశవ అంటే అమిత ప్రేమ. తమ ఫిలిం కంపెనీకి 'కేశవ పిక్చర్స్' అని పేరు పెట్టారు.

వనజ తన వుద్దేశాన్ని ఖాయం చేసుకుంది. ఆరాత్రే విశాఖపట్నం వెళ్ళేందుకు నిశ్చయించుకుంది. పగలల్లా కేశవను వదలలేదు. చాటుగా ముద్దాడి ఏడ్చింది. కడసారి తను కన్న కేశవను చూసి ఒక చీటీ దగ్గర పడేసి వెళ్ళి పోయింది వనజ. కళ్యాణి బయటినుండి వెళ్ళి కొన్నిగంటలకి తిరిగి వచ్చింది. కేశవ దగ్గర వనజ లేదు. ఒక చీటీ ఉంది. "సోదరీ! నీ మేలు తీర్చుకోలేను. కేశవ నీబిడ్డ. నా జీవితానికి భావిలో ప్రయోజనంలేదు. అందుకని వెళ్ళి పోతున్నా. చెప్పకుండా వెళ్ళటం మీరు ఆటంకం పెడ తారనే. క్షమిస్తావుకదూ! కేశవ కళ్యాణి దంపతులకు ముద్దుబిడ్డ.

కృతజ్ఞురాలు వనజ"

కళ్యాణి, ఆమె భర్త ఇది చూసి చాలా విచారించారు. కేశవను ఒళ్ళోకి తీసుకొని ఒకసారి కన్నీరు కార్చారు.

వనజ విశాఖపట్నంలో దిగింది. కళ్యాణి ఇచ్చిన సొమ్ము కొంత మాసాలకు సరిపోయేటట్లు తన భర్త పేర చెక్కు వ్రాసి, ఒక ఉత్తరం కూడా పెట్టి కవరు అంటించింది. తన అంతిమ యాత్రకి కావలసిన సన్నాహాలు చేసి వుంచింది.

బాగా చీకటి పడిన తర్వాత ఇంటికి బయలుదేరింది. తలుపు లోపల గడియ వేసివుంది. లోపలనుంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి, తన భర్త, మరెవరో స్త్రీ బహుశః రెండో భార్య అయి వుండవచ్చు. వనజ తలుపు దగ్గర నుంచున్నది.

"అదే నండీ. 'అనుమానం' సినిమా అని తీసుకొని వెళ్ళి సగంలోనే ఇంటికి లాక్కొచ్చారు" అంది ఆ స్త్రీ.

"పోనిస్తూ పాడు ఫిలిం తలనొప్పిగా వుంది" అన్నాడు సుందరం.

"అవును, అలాగే నొప్పిగా వుంటుంది. అనుమానం వున్న భార్యను శీలవతి అని రుజువు చేస్తుంటే నామర్దా కాదూ, అనుమానం పడ్డ మగధీరులికి" అన్నది ఆ స్త్రీ చలోక్తిగా.

"మహా పెద్ద క్రిటిక్కులాగా చెప్పొచ్చావుకాని" అన్నాడు.

"ఆహా! ఎంతబాగా యాక్టు చేసిందండీ. ఆమెలో మాతృత్వం ఎలా మూర్తీభవించిందో" అని పొగడుతోంది.

"ఆ సోది మానెయ్యి" అని గర్జించాడు సుందరం.

వనజ తలుపు తట్టింది గబగబా పెద్ద శబ్దం చేస్తూ. సుందరం, ఆ స్త్రీ పరుగున వెళ్ళి తలుపు తీశారు... వనజ గభాలున సుందరం కాళ్ళమీద ఆ కవరు పడేసి తల పెట్టింది. ఒక్కమారు పైకిచూసి శాశ్వత నిద్ర నుపక్ర మించింది. ఆమె ప్రక్కనే పగిలిన చిన్న సీసా వుంది, దానిమీద 'విషం' అని వుంది.

(సమాప్తం.)